1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 149 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 13 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 149 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 13 April 2025 PAGES : 8 PRICE : 3/-

## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీలు సత్తా చాటాయి

ఫస్టియర్ లో 70 శాతం ఉత్తీర్ణత
సెకండియర్ లో 83 శాతం ఉత్తీర్ణత
ప్రభుత్వ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్న సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)



ఏపీలో ఇవాళ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతో నిరాడంబరంగా, చెప్పిన సమయానికే ఇంటర్ ఫలితాలను వెలువరించారు. ఫస్టియర్ విద్యార్థుల్లో 70 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, సెకండియర్ విద్యార్థుల్లో 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మిగతా 2లో

## వైసీపీకి షాక్... నిడదవోలు మున్సిపాలిటీ జనసేన కైవసం

నిడదవోలు మున్సిపాలిటీలో మొత్తం 28 మంది కౌన్సిలర్లు
వైసీపీకి 27 మంది కౌన్సిలర్లు
జనసేనలో చేరిన 14 మంది వైసీపీ కౌన్సిలర్లు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)

ఏపీలో ఇప్పటికే పలు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు వైసీపీ చేజారాయి. తాజాగా ఆ పార్టీకి మరో షాక్ తగిలింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపాలిటీని జనసేన కైవసం చేసుకుంది. నిడదవోలు మున్సిపాలిటీలో మొత్తం 28 మంది కౌన్సిలర్లు ఉండగా... వీరిలో 27 మంది వైసీపీ, ఒక టీడీపీ కౌన్సిలర్ ఉండేవారు. వైసీపీకి చెందిన కౌన్సిలర్లలో 14 మంది జనసేనలో చేరారు. దీంతో నిడదవోలు మున్సిపాలిటీ జనసేన వశమయింది. నిడదవోలు మున్సిపాలిటీ కూడా చేజారి పోవడంతో వైసీపీ శ్రేణులు డీలా పడిపోయాయి.



## 33 మందితో వైసీపీ రాజకీయ సలహా సంఘం

పీఏసీని ప్రకటించిన జగన్
వైసీపీ కీలకనేతలందరికీ ఈ కమిటీలో స్థానం
పీఏసీలో శాశ్వత ఆహ్వానితులుగా పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)



వైసీపీ అధినేత జగన్ ఇవాళ తమ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని ప్రకటించారు. ఈ పీఏసీలో 33 మంది సభ్యులు ఉన్నారు. ఎంపీలు అవినాశ్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు రోజా, విడదల రజని, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషా, మిగతా 2లో

## వక్ఫ్ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోం

రాజకీయాల కోసం అల్లర్లకు పాల్పడవద్దన్న మమతా బెనర్జీ
చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్న మమతా బెనర్జీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 12)

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. వక్ఫ్ చట్టం మంగళవారం నుంచి అమలులోకి వచ్చిన నేపథ్యంలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ ప్రాంతాలలో నిరసనకారులు ఆందోళనలు నిర్వహించి రోడ్లను దిగ్బంధించారు. వారిని నిలువరించేందుకు ప్రయత్నించిన పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ స్పందిస్తూ, ప్రతి జీవితం ఎంతో విలువైనదని, రాజకీయాల మిగతా 2లో



## అసెంబ్లీ ఎన్నికల్లో అసలు పోరాటం డీఎంకే, టీవీకే మధ్యే ఉంటుంది

మళ్లీ చేతులు కలిపిన పాత మిత్రులు అన్నాడీఎంకే, బీజేపీ
ఈ పొత్తులో ఆశ్చర్యమేమీ లేదన్న విజయ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని అన్నాడీఎంకే, బీజేపీ నిర్ణయించుకోవడంపై టీవీకే పార్టీ అధినేత, హీరో విజయ్ స్పందించారు. అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు ఆశ్చర్యం కలిగించలేదని, వాళ్లు పాత భాగస్వాములేనని, కాకపోతే మళ్లీ కలిశారని వ్యాఖ్యానించారు. వేరే మార్గం లేక, మిగతా 2లో

## ఫిల్మ్ క్లబ్ ను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైజాగ్
ఫిల్మ్ క్లబ్ దారి తప్పిందన్న గంటా
ఫిల్మ్ క్లబ్ లో 15 వందల మంది సభ్యులు ఉన్నారని వెల్లడి
సినీ పరిశ్రమకు వైజాగ్ సెంటిమెంట్ ప్రాంతమన్న గంటా

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)

విశాఖపట్నం ఫిల్మ్ క్లబ్ ను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 2015లో విశాఖలో ఫిల్మ్ క్లబ్ ఏర్పాటు చేశామని... 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫిల్మ్ క్లబ్ దారి తప్పిందని తెలిపారు. ఎన్నికల



కోసం నోటిఫికేషన్ ఇస్తే అందులో కూడా అవకతవకలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఫిల్మ్ క్లబ్ లో 15 వందల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఫిల్మ్ క్లబ్ కు భూమి కేటాయించి భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని గంటా చెప్పారు. వైజాగ్ కు సినీ పరిశ్రమ రావాలని అందరూ కోరుకుంటున్నారని తెలిపారు. సినీ పరిశ్రమకు వైజాగ్ ఒక సెంటిమెంట్ ప్రాంతమని చెప్పారు. విశాఖకు రావడానికి సినీ పెద్దలు కూడా సుముఖత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైజాగ్ ను ఫిల్మ్ హబ్ గా తయారు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు.

## వనజీవి రామయ్య సలహాను పాటించాం

వనజీవి రామయ్య మృతి కలచివేసిందన్న నాగబాబు
ఆయన సలహాతో 10 వేలకు పైగా మొక్కలు నాటామని వెల్లడి
రామయ్య ఒక రియల్ హీరో అని ప్రశంస

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)

వనజీవి రామయ్య మృతి పట్ల జనసేన ఎమ్మెల్సీ నాగబాబు విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తనను కలచివేసిందని అన్నారు. గతంలో హైదరాబాద్ లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామయ్యను సన్మానించడం జరిగిందని తెలిపారు. అప్పటికే మొక్కలు నాటే కార్యక్రమంలో తనకు అవగాహన ఉందని... ఆయన సలహాతో జీడిమెట్లలోని ప్రభుత్వ భూమిలో 10 వేలకు పైగా మిగతా 2లో



## ముస్లింల ఓటు బ్యాంకు కోసం దుష్ప్రచారం చేస్తున్నారు

అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారని మోదీ ప్రభుత్వంపై
తప్పుడు ప్రచారం చేశారన్న పురందేశ్వరి
కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగానికి ఎక్కువ సార్లు
సవరణలు జరిగాయని విమర్శ
అంబేద్కర్ ను గతంలో కాంగ్రెస్ అవమానించిందని మండిపాటు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 12)

ముస్లింల ఓటు బ్యాంకు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారంటూ మోదీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగానికి ఎక్కువ సార్లు సవరణలు జరిగాయని తెలిపారు. బీజేపీ హయాంలో 22 సార్లు సవరణలు చేశారని... ఇవన్నీ వివిధ వర్గాల అభ్యున్నతికి మిగతా 2లో





## 85వేల వీసాలు ఇచ్చిన చైనా..

భారత స్నేహితులకు స్వాగతమంటూ పోస్ట్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 12)

సరిహద్దు విషయంలో భారత్-చైనా మధ్య ఎప్పుడూ ఉద్రిక్త వాతావరణమే కనిపిస్తుంటుంది. అయితే ఇటీవల ఆ వైఖరిలో మార్పు వస్తున్నట్లు స్పష్టమవుతోంది. భారత్‌వైపు చైనా స్నేహహస్తాన్ని చాస్తోంది. ఈ క్రమంలోనే విదేశీ పర్యటకులను ఆకట్టుకునేలా.. మరీ ముఖ్యంగా తమ దేశంలో భారతపౌరుల ప్రయాణాన్ని సులభతరం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. దానిలో భాగంగా ఏప్రిల్ 9 వరకు 85వేల వీసాలు జారీ చేసింది. ఈ మేరకు మనదేశంలోని చైనా రాయబారి జు ఫీహాంగ్ వెల్లడించారు."భారత్‌లోని చైనా ఎంబసీ, కాన్సులేట్లు ఈ ఏడాది ఏప్రిల్ 9 వరకు భారతీయులకు 85వేలకుపైగా వీసాలు జారీ చేశాయి. చైనాను సందర్శించడానికి మరింతమంది భారత స్నేహితులకు స్వాగతం. సురక్షిత, స్నేహపూర్వక, స్ఫూర్తివంతమైన చైనాను అన్వేషించండి" అని ఫీహాంగ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మార్చిలో కూడా ఆయన ఈ తరహా పోస్టు చేశారు. అప్పటికే 50వేల వీసాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వీసా ధరలపై తగ్గింపును డ్రాగన్ మరో ఏడాది పొడిగించిన సంగతి తెలిసిందే. 2025 డిసెంబరు 31 వరకు వీసా ఫీజుల తగ్గింపు కొనసాగుతుందని వెల్లడించింది.చైనాను సందర్శించే విదేశీయుల ప్రయాణ మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి

# ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీలు సత్తా చాటాయి

ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఈసారి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులందరికీ హార్దిక శుభాభినందనలు తెలుపుతున్నానని వెల్లడించారు. "ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ఫస్టియర్ లో 47 శాతం, సెకండియర్ లో 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఫస్టియర్ లో 11 శాతం, సెకండియర్ లో 9 శాతం పెరుగుదల నమోదైంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, కేంద్రీకృత మూల్యాంకనం, పర్యవేక్షణ, నూతన సమయపాలన, 100 రోజుల సక్సెస్ కార్యక్రమం, తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు, సంరక్షకుల వ్యవస్థ... ఇలా విద్యా రంగంలో మేము ప్రవేశపెట్టిన సంస్కరణలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి" అని చంద్రబాబు వివరించారు.

## 33 మందితో వైసీపీ రాజకీయ సలహా సంఘం

ఆదిమూలపు సురేశ్, నారాయణస్వామి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ముద్రగడ పద్మనాభం, సాకే శైలజానాథ్, నందిగం సురేశ్ తదితరులకు ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ రాజకీయ సలహాల కమిటీకి పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సభ్యుల జాబితాలతో కూడిన ప్రకటన విడుదలైంది. కొందరిని తప్పించి... దాదాపు వైసీపీలో కీలక నేతలందరికీ ఈ కమిటీలో స్థానం లభించింది. ఈ పీఏసీలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.

## వక్ఫ్ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోం

కోసం అల్లర్లకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అల్లర్లకు పాల్పడేవారు సమాజానికి ప్రమాదకారులని, వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం మతాన్ని దుర్వినియోగం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి చర్యలకు లొంగవద్దని సూచించారు.మతం అంటే మానవత్వం, నాగరికత, సామరస్యం అని ఆమె అన్నారు. శాంతి, సామరస్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరిని కోరారు. ఈ చట్టాన్ని తాము చేయలేదని, వ్యతిరేకిస్తున్నవారు కేంద్ర ప్రభుత్వం వద్ద సమాధానం కోరాలని ఆమె సూచించారు. వక్ఫ్ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయబోమని స్పష్టం చేశారు.

## వనజీవి రామయ్య సలహాను పాటించాం

మొక్కలు నాటామని చెప్పారు. రామయ్య చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ తాము కొంత ఆర్థిక సాయం కూడా చేశామని నాగబాబు తెలిపారు. రామయ్య ఒక రియల్ హీరో అని... ఆయనకు పద్మశ్రీ దక్కడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ప్రకృతి పట్ల ఆయనకున్న అంకితభావం, నిబద్ధత చాలా గొప్పదని కొనియాడారు. ఆయన నాటిన మొక్కల ద్వారా ఎంతో మంది సేద తీరుతున్నారని చెప్పారు. ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాలని పిలుపునిచ్చారు. రామయ్య మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నానని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

## ముస్లింల ఓటు బ్యాంకు కోసం దుష్ప్రచారం చేస్తున్నారు

దోహదం చేసేవని చెప్పారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఈరోజు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న బూత్ లెవెల్ లో పలు కార్యాక్రమాలను చేపడుతున్నామని పురందేశ్వరి వెల్లడించారు. అంబేద్కర్ కు సరైన గౌరవం ఇచ్చింది బీజేపీనే అని చెప్పారు. అంబేద్కర్ ను గతంలో అవమానించి ఆయన రాజీనామా చేసేలా చేసిన చరిత్ర ఎవరిదో అందరికీ తెలుసని అన్నారు. అంబేద్కర్ నివాసాన్ని అభివృద్ధి చేసింది కూడా బీజేపీనే అని చెప్పారు. భారత రాజ్యాంగం వల్లే బీసీ అయిన తాను ప్రధాని అయ్యానని మోదీ చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఇలాంటి అంశాలపై పరిజ్ఞానం పెంచుకుని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, దయాకర్ రెడ్డి, గుడిసె దేవానంద్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు

## 85వేల వీసాలు ఇచ్చిన చైనా..

విధానాలను క్రమబద్ధీకరించడం కోసం ఈ చర్యలు చేపట్టామని దౌత్య కార్యాలయం అప్పట్లో వెల్లడించింది. గతేడాది ఈ వీసా ధరలను తగ్గించారు. అప్పటినుంచి సింగిల్ ఎంట్రీ వీసాలకు రూ.2,900, డబుల్ ఎంట్రీ వీసాలకు రూ.4,400 వసూలుచేస్తున్నారు. ఆరు నెలల గడువు ఉండే మల్టిపుల్ ఎంట్రీ వీసాకు రూ.5900, సంవత్సరం, అంతకంటే పైబడి గడువు ఉండే మల్టీ ఎంట్రీ వీసా రూ.8,800 చెల్లించాల్సి ఉంటుంది.గత అక్టోబర్ నుంచి చైనా నుంచి సానుకూల వైఖరి కనిపిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించుకోవడం కోసం భారత్ , చైనా ఆ నెలలోనే కీలక గస్తీ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల భారత ఆర్థిక వృద్ధి అమోఘం అంటూ చైనా కాన్సుల్ జనరల్ జువీ కొనియాడిన సంగతి తెలిసిందే. హిందీ చినీ భాయ్ భాయ్' అంటూ భారత్ సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఇక అమెరికా ప్రతీకార సుంకాల వేళ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌కు స్నేహహస్తం చాచారు. భారత్‌తో కలిసి ఉమ్మడి భవిష్యత్తు లక్ష్యంగా పనిచేసే సమాజాన్ని నిర్మించాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో అసలు పోరాటం డీఎంకే, టీవీకే మధ్యే ఉంటుంది

విధిలేని పరిస్థితుల్లో పొత్తు కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని విజయ్ తెలిపారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ పొత్తు ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చుని... అసలైన పోరు డీఎంకే, టీవీకే మధ్యనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక, డీఎంకే, బీజేపీ వేర్వేరు కాదని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, కానీ ప్రజల కంటితుడుపు కోసం శత్రువులుగా నటిస్తుంటాయని విజయ్ విమర్శించారు. అవినీతిపై పోరాడుతున్నామని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఎందుకు తమిళనాడు సర్కారుపై చర్యలు తీసుకోవడంలేదని సూటిగా ప్రశ్నించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి ఆనం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)

నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజక వర్గ పరిధిలోని 47 మంది బాధిత కుటుంబ లబ్ధిదారులకు రూ. 47.84 లక్షలు విలువైన చెక్కులు శనివారం పంపిణీ చేశారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని మంత్రి ఆనం అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ కూడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే 175 నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఈ పది నెలల కాలంలోనే ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో 183 కుటుంబాలకు 2.22 కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించారని మంత్రి ఆనం తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం వర్తించకుండా, కార్పొరేట్ వైద్యం చేయించుకున్న కుటుంబాలకు ఆసరాగా ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్న గొప్ప మానవతావాది మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధిత కుటుంబాల తరపున సీఎంకు మంత్రి ఆనం ధన్యవాదాలు తెలిపారు. ఉచిత లాభదాయక విద్యుత్ పథకమైన పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా లాభదాయకమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బృహత్తర పథకం పిఎం సూర్యఘర్ పథకం తెచ్చారని మంత్రి ఆనం తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నియోజకవర్గానికి 10వేలు చొప్పున ఒక లక్ష సోలార్ యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి ఆనం తెలిపారు. ప్రతి ఒక్క పేద కుటుంబం ఈ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఆదా చేయడంతో పాటు ప్రతి నెల కొంత ఆదాయం పొందాలని మంత్రి ఆనం ఆకాంక్షించారు. రెండు కిలోవాట్ల సోలార్ యూనిట్ 1.20 లక్షలు ఖర్చు అవుతుండగా ఎస్సీ , ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తామన్నారు. బీసీలకు, ఇతరులకు కొంత సబ్సిడీతో, సున్నా వడ్డీ రుణాలు ఇప్పించి సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ, ప్రతి పేద కుటుంబం కూడా జీవితాంతం ఉచితంగా విద్యుత్తును పొందాలనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అందులో భాగంగానే పీఎం సూర్య ఘర్ పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి ఆనం తెలిపారు. ఈ లాభదాయక విద్యుత్ పథకాన్ని ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెలాఖరులో ఆత్మకూరులో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తామని మంత్రి ఆనం తెలిపారు. సుమారు 30 కంపెనీలు పాల్గొంటున్న ఈ మెగా జాబ్ మేళాను విద్యావంతులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు.



# విద్యా వ్యవస్థను వడ్డీ వ్యాపారంగా మార్చిన ఎన్డీఏ ప్రభుత్వం

### వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)




వైసీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థను వడ్డీ వ్యాపారంగా మార్చిన విధానంపై జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి మీడియా సమావేశం శనివారం నిర్వహించారు. విద్య అనేది మన దేశంలో ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు, తల్లితండ్రులు తమ పిల్లలకు మంచి విద్యని అందించడమే లక్ష్యంగా పెట్టుకొని కష్టపడుతూ ఉంటారు. ఎందుకంటే విధ్య తోనే పేద , మద్యతరగతి ప్రజల జీవనం మారుతుందని ఒక నమ్మకం. సరిగ్గా ఈ అంశాన్ని కొంతమంది కార్పొరేట్ విద్యాసంస్థలు అది వారి బలహీనతగా పరిగణించి వారి వద్ద అడ్డగోలుగా లక్షలు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రి కేజీ, కిండర్గార్డెన్, ప్రైమరీ తరగతులకు కూడా లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. 9,10 తరగతులకు అయితే రెండు లక్షలు దాకా వసూలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితులలో తల్లితండ్రులు తమ పిల్లలకు ఎలా అయినా విద్యని అందించాలనే తాపత్రయంతో అప్పుల ఊబిలో చిక్కుకుని మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ యాక్ట్ ప్రకారం విద్యాసంస్థలు సర్వీస్ క్యాటగిరీ కింద నో లాస్ నో గెయిన్ తో తమ సంస్థలను నడపవల్సి ఉంది. ఈ నిబంధనను మరచి సంస్థలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ అడ్డగోలు అదిక ఫీజుల బారినుండి పేద, మద్యతరగతి తల్లితండ్రులకు ఉపశమనం కలిగించే విదంగా ఈ అధిక ఫీజులను నియంత్రించే విదంగా జి.ఓ ఎం.ఎస్ నంబర్ 53 ఆఫ్ 2020 ద్వారా ఫీజు రెగ్యులటరీ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీ రెగ్యులటరీ కమిషన్ ను పూర్తిగా విస్మరించింది. తల్లితండ్రుల ఆవేదన తమకు ఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తుంది. ఈ కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లితండ్రుల ఆర్థిక బలహీనతను అలుసుగా తీసుకొని కొన్ని ఫైనాన్స్ కంపెనీలతో కుమ్మక్క అయ్యి సులభ వాయిదాలలో ఫీజుని చెల్లించవచ్చు అని ఆ వాయిదాల పై 2.5% నుండి 3% వడ్డీని కూడా వసూలు చేసే దిగజారుడు సంస్కృతిని మన ముందుకు తీసుకొస్తున్నాయి. తల్లితండ్రులు ఏమారి సులభ వాయిదాలే కదా కట్టేద్దాం అని పొరపాటున మోసపోతున్నారు. చిన్న చిన్న ఫైనాన్స్ కంపెనీలు వాయిదాలు ఒక రోజు లేట్ అయినందుకు ఎలా వేదిస్తారో మన అందరికి తెలిసిన విషయమే. కట్టని ఎడల ఇంటి దగ్గర గొడవ చేయడం, ఫోన్ కాల్స్‌లో బెదిరించడం ఇలా అనేక దుశ్చర్యలకు పాల్పడుతారు. ఇది కాల్ మనీ తరహా సంస్కృతికి దారితీయడమే కాకుండా మానసిక వత్తిడులకు దారి తీస్తుంది. నగరంలో అలాగే రాష్ట్రంలో ఒక ప్రముఖ విద్యాసంస్థ ఈ ఫైనాన్స్ కంపెనీ మోడల్ ను ప్రోత్సహించడం చాలా బాధాకరం. తక్షణమే విద్యాశాఖ మంత్రి అలాగే ఆ సంస్థ యజమానులు కూడా ఈ విధానం గురించి పునరాలోచించాలని కోరుకుంటున్నామన్నారు. విద్యార్థులు అలాగే వారి తల్లితండ్రులు కూడా ఈ విష సంస్కృతిపై అప్రమత్తంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# అక్కచెరువుపాడులో స్వచ్ఛభారత్ కార్యక్రమం

### పర్యావరణ ప్రేమికుడు రామయ్యకి శ్రద్ధాంజలి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)

పర్యావరణ ప్రేమికుడు రామయ్యకి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి సంస్మరణార్ధం ప్రతి మంచి పనికి, చెడ్డ పనికి ఒక చెట్టును నాటి వారి స్ఫూర్తిని ముందుకు నడిపిద్దామని జనసేన నాయకులు గునుకుల కిషోర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పర్యవేక్షకులు ఏపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో గత మూడు వారాలుగా టిడ్కో ఇళ్ల దగ్గర కొనసాగుతున్న స్వచ్ఛభారత్‌లో భాగంగా లోను మల్లికార్జున యాదవ్ నెల్లూరు రూరల్ అక్కచెరువుపాడులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వనజీవి పద్మశ్రీ రామయ్య సంస్మరణార్ధం మొక్కని నాటి వారి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదనే మంచి అభిప్రాయంతో కూటమి ప్రభుత్వం నాణ్యమైన ఇళ్లను పేద ప్రజలకు ఉచితంగా ఇస్తుందన్నారు. చుట్టూ పర్యావరణం కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా గృహస్థులకు ఉంది అని తెలియజేస్తూ జిల్లా పర్యవేక్షకులు ఏపీ టీడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో నూనె మల్లికార్జున ఆధ్వర్యంలో మూడు వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వనజీవి పర్యావరణ ప్రేమికుడు పద్మశ్రీ రామయ్య గుండెపోటుతో మరణించారన్న మాట తమను దిగ్భ్రాంతికి గురయ్యామన్నారు. కోటి మొక్కలకు పైగా నాటి భవిష్యత్తు పర్యావరణానికి మొక్కలు ఎంతో ముఖ్యమని చాటి చెప్పిన వారిని స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తూ మంచి పనికి గాని చెడ్డ పనికి కానీ ఒక మొక్కను నాటి వారి స్ఫూర్తిని సాగించవలసిందిగా కోరారు.



షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# త్రిపురాంతకం రేషన్ బకాసురుల బండారం బట్టబయలు

## 200 బస్తాల రేషన్ బియ్యం సీజ్!




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 12)**
త్రిపురాంతకం మండలంలో పేదల కోసం ఉద్దేశించిన రేషన్ బియ్యం గద్దల మాదిరిగా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఆకలి తీర్చాల్సిన నిత్యావసర సరుకులు అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ప్రభావం వల్ల కొందరి కడుపుల్ని మాత్రమే నింపుతున్న వాస్తవం ఇప్పుడు స్పష్టమవుతోంది. తాజాగా శుక్రవారం రోజు మార్కాపురం సబ్ కలెక్టర్ వివి సహదీప్ 200 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. ఈ చర్యతో రేషన్ మాఫియా బడుగు బలహీనుల నెత్తిన ఎలా కూర్చుందో మరోసారి బయటపడింది. ప్రజల ఆరోపణల ప్రకారం, ప్రతినెలా సరఫరా అయ్యే నిత్యవసర సరుకులు చౌకదుకాణాలకు సరైన సమయంలో, సరైన విధంగా చేరుతున్నాయా? లేదా కొంత మొత్తం గోదాంలోనే నిలిపివేస్తున్నారా అన్నదానిపై సివిల్ సప్లై అధికారులు గట్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ కొంతమంది అధికారులు పాలకపక్ష నేతల మెప్పు పొందేందుకు మాత్రమే చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. చౌకదుకాణాలపై నెల నెలా పర్యవేక్షణ ఉంటే, డీలర్లు అక్రమాలకు మొగ్గు చూపరని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు 200 బస్తాల బియ్యం పట్టుబడటంతో, ఈ మండలంలో ఇంకా ఎన్ని అక్రమాలు జరుగుతున్నాయో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజల డిమాండ్:**
ఈ ఘటనను తక్షణమే దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పేదల హక్కులను రక్షించాలంటే, సివిల్ సప్లై వ్యవస్థను సమూలంగా పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతినెలా డీలర్ల పనితీరుపై సమీక్ష, అక్రమాలపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలి. సివిల్ సప్లై అధికారులు ప్రజల ఆకలిని తీర్చేందుకా? లేక రాజకీయ నేతల ఆశీస్సులు పొందేందుకా పని చేస్తున్నారు? ఈ సంఘటనకు ప్రజల నుంచి ఉధృతంగా స్పందన వ్యక్తమవుతుండగా, రాబోయే రోజుల్లో అధికారుల వైఖరి ఎలా ఉంటుందో చూడాలి మరి!

వివేకానంద జూనియర్ కళాశాల
ఎంపిసి, బైపీసీలో
రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించిన విద్యార్థులు

# సంచలనాలకు చిరునామా



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 12)**
సంచలనాల చిరునామా,మార్కుల ప్రభంజనానికి వేదిక, స్టేట్ ర్యాంక్‌ల పంట శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల అని కళాశాల పేర్కొంది. శనివారం ప్రకటించిన ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాలలో ఎదురులేని, తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని ఇంటర్మీడియేట్ విద్యారంగంలో మాకు మేమే సాటి మాకెవ్వరూ లేరు పోటీ అని నిరూపించారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో షేక్ రబ్బానీ ముస్కాన్ అనే విద్యార్థినీ 988/1000 మార్కులు సాధించి స్టేట్ 4వ ర్యాంక్ ను సాధించారు. బైపిసి లో 988/1000 మార్కులు సాధించి రాగి మధురాగిని అనే విద్యార్థినీ స్టేట్ 4వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు. ఇవేకాక 982, 979, 976, 967, 966, 961ఇలా..వరుసగా మార్కులలో అగ్రగామీగా నిలిచారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో బొప్పరాజు నందిని 460/470 మార్కులు

4

# ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం


చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు
ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.340 కోట్లతో స్వయం ఉపాధి రుణాలు
పి4 తోనే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యం
డ్వాక్రా చంద్రబాబు నాయుడు మానస పుత్రిక
మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
పాకల ఎస్సీ కాలనీలో రూ. 12 లక్షల విలువైన రెండు ఆర్వో ప్లాంట్లను ప్రారంభించిన
మంత్రి డోలా, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 12)**
ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని, పి4 తో రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం సాయంత్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల ఎస్సీ కాలనీలో రూ. 12 లక్షల విలువైన రెండు ఆర్వో ప్లాంట్లను ఏపీ మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడింది టిడిపినే. కూటమి ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే ఎస్సీ కాలనీల్లో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఎస్సీ కార్పొరేషన్
(తరువాయి 4లో...)



మహా పూర్ణాహుతి, కుంభాభిషేకంలో పాల్గొన్న
మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, కుటుంబ సభ్యులు
వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్
నయన మనోహరంగా నగరోత్సవం
పాల్గొన్న భక్త జన సందోహం



## శాస్త్రోక్తంగా శ్రీ హరిహర క్షేత్రంలో

# మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం

**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఏప్రిల్ 12)**
చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు వారి కుటుంబ సభ్యులు అధ్వర్యంలో 19వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. శనివారం ఉదయం ఆలయం వెంచేసి వున్న సర్వ దేవతలకు విశేష అభిషేకాలు, విశేష పూజలు ఆగమ విశా రాధకృష్ణ శర్మ బృందం చే అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులను, శిద్దా పాండురంగారావు దంపతులను ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. 19వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విలువైన కానుకలు అందచేసిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులు. ఈ సందర్భంగా సువర్ణ హృదయ లక్ష్మి శ్రీదేవి, హృదయ భూదేవి బంగారు ఆభరణం, రజిత సువర్ణ డాలర్‌తో కూడిన యజ్ఞోపవేతం కానుకను శిద్దా రాఘవరావు దంపతులు స్వామి వారికి అందచేశారు. గత రెండు రోజులుగా జరుగుతున్న నిత్య హెూమాలు, మూల మంత్ర హెూమం, కళాన్యాస హెూమాలతో (తరువాయి 4లో...)

# శాస్త్రోక్తంగా శ్రీ హరిహర క్షేత్రంలో మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం



శ్రీ హరిహర క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేద పండితులు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో మూల విరాట్‌లకు ఆలయ ధర్మ కర్తలచే కలశ ప్రదక్షిణ వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ మహా పూర్ణాహుతి కార్యక్రమంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ హరిహర క్షేత్రం 19వ వార్షికోత్సవంలో భాగంగా కీలక ఘట్టంగా భావించే మహా సంప్రోక్షణ కార్యక్రమం, ఆస్థాన వేద పండితులచే మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ హరిహరక్షేత్రం వార్షికోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలసి పాల్గొన్న సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్‌కు స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా కుటుంబ సభ్యులకు ఆశీర్వాదాలతో పాటుగా అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందచేశారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు భోజన సదుపాయాలు కల్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు.

**కన్నుల పండువలా నగరోత్సవం**

శనివారం సాయంత్రం జరిగిన శ్రీ హరిహర క్షేత్ర సర్వ దేవతల నగరోత్సవం నయనానందకరంగా సాగింది. శిద్దా రాఘవరావు దంపతులు ఆధ్వర్యంలో జరిగిన నగరోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిద్దా కుటుంబ సభ్యులు, గ్రానైట్ రంగాలకు చెందిన ప్రముఖులు, దర్శి, ఒంగోలు, కందుకూరు, మార్కాపురంకు చెందిన ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ వార్తను మొదటి పేజీలో ప్రచురించాలి.













# ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం



ద్వారా రూ.341 కోట్లతో రాష్ట్రంలో 20,692 మంది రుణాలు ఇవ్వబోతున్నాం. వైసీపీ పాలనలో జగన్ ఎస్సీ కార్పొరేషన్ ని నిర్వీర్యం చేశారు. గత 5 ఏళ్లలో కనీసం ఒక్కరికి కూడా ఒక లక్ష రూపాయల రుణం ఇచ్చిన పాపాన పోలేదు. ఎస్సి విద్యార్థుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని తీసుకొస్తే జగన్ దాని రద్దుచేసి ఎస్సి విద్యార్థులకు ద్రోహం చేశారు. జగన్ రద్దు చేసిన అంబేద్కర్ విదేశీ విద్యను మళ్లీ పున ప్రారంభిస్తాం. చర్మకారులు, డప్పు కళాకారులకు పింఛన్లు ఇచ్చిన ఘనత టిడిపిదే. డ్వాక్రా మహిళల సాధికారతకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. డ్వాక్రా చంద్రబాబు నాయుడు మానస పుత్రిక. పి 4 రాష్ట్రంలో తోనే పేదరిక నిర్మూలన సాధ్యం. పేదలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతోపాటు ధనవంతులు సహకరించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.



# సంచలనాలకు చిరునామా



సాధించి స్టేట్ 6 వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు.బైపిసి లో కొమ్ముల అక్ష 432/440 కి సాధించి స్టేట్ 4 వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు.బైపిసి లో మరో విద్యార్థిని మరియా బుష్రా అనే విద్యార్థినీ 430/440కి సాధించి స్టేట్ 6వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పోలు శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాళ్ళు కుమార్, బోనం శ్రీనివాసరెడ్డి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వారి తల్లిదండ్రులు కేక్ కట్ చేసి విద్యార్థులకు



# యదార్థ సంఘటన నేపథ్యంలో 23 చిత్రం గోరంట్లలో చిత్ర ప్రదర్శన

## తిలకించిన ప్రముఖులు

## యూనిట్‌కు అభినందనలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)

1993లో జరిగిన యదార్థ సంఘటన నేపథ్యంలో చిత్రీకరించిన 23 మూవీ ప్రీవియర్ షో గోరంట్ల మల్టీప్లెక్స్ థియేటర్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మీడియా సమావేశశంలో చిత్ర విశేషాలు వివరించారు. 93 లో జరిగిన చిలకలూరిపేట బస్సు దహనం ఘటనను చిత్రం రూపంలో చూపించడం జరిగిందని, క్షణికావేశంతో జరిగిన ఓ సంఘటన వల్ల అనేక కుటుంబాలు చిద్ర మయ్యాయని డైరెక్టర్ తేజ తెలిపారు. అయితే ఈ చిత్రంలో ఎటువంటి కాంట్రవర్సీ ఉండదని, అనుకోకుండా జరిగిన ఘటనలు జీవితాలను ఎలా మలుపు తిప్పుతాయన్న అంశం మీదే ఈ చిత్రాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. చిత్రంలోని హీరో హీరోయిన్లు మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు మనవడు రాయపాటి తేజ,తన్మయి కొత్తవాళ్లయిన హీరో, హీరోయిన్లుగా చక్కగా నటించారని చెప్పారు. పాటల రచయిత చంద్రబోస్ చక్కని సాహిత్యం అందించారని తెలిపారు. ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించాలని వారు పేర్కొన్నారు. చిత్ర యూనిట్‌కు మండవ మురళీకృష్ణ, రావుల పద్మజ, బోడపాటి వెంకట్, తదితరులు అభినందనలు తెలిపారు.

# ఇంటర్ ఫలితాలలో నారాయణ విద్యార్థుల విజయఢంకా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)









శనివారం విడుదలైన మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఒంగోలు నారాయణ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటారు. ఎం. పి. సి. గ్రూప్ కి చెందిన పి. భవజ్ఞ ప్రియ, జి ప్రణతి దత్త సాయి ఇరువురు 470 కి 466 మార్కులు సాధించగా, డి. దేవి అక్షయ, కౌసల్య మన్నో, డి. సాహితీ 470 కి 465 మార్కులు సాధించారు. 460 కి పైగా మార్కులు 28 మంది సాధించారు. బై పి సి గ్రూపు కి చెందిన హాసిని 440 కి 434 , హఫీఫా 427 మార్కులు సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో షేక్ రైజా 1000 కి 990, గీతిక 989 మార్కులు సాధించారు. 980కి పైగా మార్కులు 26 మంది సాధించారు. మొత్తం మీద 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ అర్. మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను , ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులను, అధ్యాపకేతర బృందాన్ని నారాయణ విద్యా సంస్థల ప్రకాశం జిల్లా డీన్ ఆర్. మధుసూదన్ రెడ్డి, ఏజీఎం మురళి, ప్రిన్సిపాల్స్ ఎం సుజాత, డి వెంటేశ్వర్లు, అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో 94.7శాతం ఉత్తీర్ణత సాధించిన గురుకుల విద్యార్థులు

## విద్యార్థులకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు




(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 12)

ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాలా వీరాంజనేయస్వామి అభినందనలు తెలిపారు. శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో గురుకుల పాఠశాలల విద్యార్థులు 94.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ ఈ ఉత్తీర్ణత సాధనలో భాగస్వాములైన గురుకుల సంస్థ ఉన్నతాధికారులకు, ఉపాధ్యాయులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. గతం కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయని, ఇలాంటి విజయాలను కొనసాగిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీసీలో 986 మార్కులు సాధించిన నెల్లూరు జిల్లా కోడూరు గురుకుల పాఠశాల విద్యార్థిని వి.ప్రియాంక, బైపీసీలో 986 మార్కులు సాధించిన కృష్ణాజిల్లా ఈడుపుగల్లు గురుకుల విద్యార్థిని ఎన్ ఇందు, నెల్లూరు జిల్లా గూడూరు గురుకుల విద్యార్థిని డి భావనని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

# టిడిపి యువ నాయకులు పెమ్మని రాజు గుండెపోటుతో మృతి

## మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 12)

మాదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు పెమ్మని రాజు శనివారం గుండెపోటుతో మృతి చెందారు.. తెలుగుదేశం పార్టీలో కీలకమైన నాయకుడిగా మంచి గుర్తింపు ఉంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ విజయానికి కష్టపడి పని చేశారు. అందరితో కలిసిమెలిసి ఎంతో ఆప్యాయంగా పలకరించే పెమ్మని రాజు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెమ్మనిరాజు. మృతి చెందాడన్న సమాచారం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పొల్లనరసింహారావు యాదవ్ తదితరులు ఉన్నారు.

# ఆరు గంటల కే క్షేత్రస్థాయిలో పనిచేయాలి

## ఉదయం 6 గంటలకే రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ టెలి కాన్ఫరెన్స్

## హాజరైన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, రీజినల్ డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)

మున్సిపల్ కమిషనర్లు ఉదయం 6 గంటల నుంచే ఖచ్చితంగా క్షేత్ర స్థాయి పర్యటన చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. శనివారం ఉదయం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం,తాగునీటి పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైన్ల పూడిక తీత వెంటనే ప్రారంభించాలన్నారు. నేను కూడా మున్సిపాలిటీల్లో ఉదయమే ఆకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. మెరుగైన పారిశుధ్యం కొరకు అవసరమైన స్వీపింగ్ మెషీన్లు,ఇతర యంత్రాలను కొత్తగా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఆరోగ్య కారణాలతో క్షేత్ర స్థాయి పర్యటన చేయలేని అధికారులకు డైరెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు అప్పగిస్తామన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేయాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.

# డాక్టర్ షంషీర్ అలీ బేగ్ సేవలు ప్రశంసనీయం

## చలి వేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నా

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 12)

వేసవి కాలంలో ప్రజల దహార్తిని తీర్చేందుకు షంషీర్ అలీ బేగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి అన్నా రాంబాబు అన్నారు. డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కోర్టు సెంటర్లో మినరల్ ఉచిత చలివేంద్రాన్ని అన్నా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో సామాజిక దృక్పథంతో ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించి విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు మరోవైపు వేసవి కాలంలో ప్రజల దహార్తిని తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. షంషీర్ అలీ బేగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అన్నారు.అందులో భాగంగా చలి వెంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అలీ బేగ్ అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం సెక్రెటరీ మేడ బద్రీనాథ్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న షంషీర్ అలీబేగ్ సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె ఇస్మాయిల్, బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సి హెచ్ కనకదుర్గ, షమ్ ఉల్ -ఉలం కాలేజీ చైర్మన్ మీర్జా జాఫర్ అలీ బేగ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోలమారు శ్రీనివాస రెడ్డి,డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాష, వైసిపి నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, బచ్చు జనార్ధన్, బొగ్గరపు శేషయ్య, చితిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# మా భూమి మాకు ఇప్పించండి అక్రమ మైనింగుకు అడ్డుకట్ట వేయండి

## ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)



తాతల నుండి వారసత్వంగా సంక్రమించిన తమ భూములను ఆక్రమణ దారుల చెర నుండి విడిపించాలని, అదేవిధంగా ఆ భూములలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలిపి వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఒంగోలు మండలం సర్వే రెడ్డి పాలెం గ్రామానికి చెందిన దళిత రైతులు కోరారు. ఒంగోలు ఎంసీఏ భవన్లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బాధిత దళిత రైతు దాసరి సుధాకర్‌రావు మాట్లాడుతూ తమ తాతల ద్వారా సర్వే రెడ్డి పాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 197/1, 197/2, 197/3 లలో 5 ఎకరాల 47 సెంట్ల డీకే భూమి తమ కుటుంబీకులకు వారసత్వంగా వచ్చిందన్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులు తమ భూమిని ఆక్రమించారన్నారు. గత 12 సంవత్సరాల నుండి తమ భూమి కోసం పోరాటం చేస్తున్న పట్టించుకున్న నాథుడు కరువయ్యారన్నారు. డీకే పట్టా, పాస్ పుస్తకం, ఆన్లైన్లో కూడా తమ పేర్లు ఉన్నాయని, అయినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములు తమకు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దళిత రైతుల భూములతోపాటుగా గ్రామంలోని ఇతర రైతుల భూములలో కూడా మైనింగ్ అక్రమ రవాణా చేస్తూ పొలాల్లోకి రానీయకుండా దౌర్జన్యం చేస్తున్న వారిపై జిల్లా అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మమ్మల్ని భూమిలోకి రానీయకుండా అక్రమంగా మైనింగ్ను లారీలు ద్వారా తరలిస్తూ అడ్డుస్తే లారీలు కింద తొక్కిస్తామని కొందరు బెదిరిస్తున్నారు అన్నారు. ఇటీవల ప్రభుత్వం రీ సర్వే చేసినప్పుడు కూడా ఆ భూములు తమవి గా రికార్డులు తేలిందని అన్నారు. జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామని రెవిన్యూ అధికారులు ఫిర్యాదు పట్టించుకోవటం లేదని అన్నారు. జిల్లా పోలీసు అధికారి కూడా వినతిపత్రం సమర్పించామని అయినా ఫలితం రాలేదని అన్నారు. దళితుల భూములను అక్రమంగా ఆక్రమించుకొని మైనింగ్ రవాణా చేస్తుంటే రైతుల భూములు కూడా నష్టపోతున్నామని మక్కని వెంకటేశ్వర్లు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎల్లావుల అంకమ్మ, అడ్డగిరి లక్ష్మి ఉన్నారు.

# టీటీడీ గోశాలలో ఆవుల మరణించాయంటూ వైసీపీ దుష్ప్రచారం

## మత విద్వేషాలు రెచ్చగొట్టి అలజడి సృష్టించేందుకు కుట్రలు చేస్తున్న భూమన కరుణాకర్ రెడ్డి


## అన్యమతస్థుడిగా ఉన్న భూమనపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి

## రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)

టీటీడీ గోశాలలో ఆవుల మరణాలపై వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మండిపడ్డారు. శనివారం ఈ మేరకు ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మత విద్వేషాలను రెచ్చగొట్టి అలజడి సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గతంలో శ్రీ వేంకటేశ్వర స్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్‌రెడ్డి మరోసారి టీటీడీపై దుష్ప్రచారానికి తెరలేపారు. కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తున్నారు. గోశాలలో ఆవులు వృద్దాప్యంతో పాటు డెలివరీ సమయంలోనూ వివిధ వ్యాధులతోనూ నెలకు సగటున 10 ఆవుల వరకూ చనిపోతుంటాయి. గడిచిన మూడు నెలల్లో ఇలాంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడ్డాయి. గత ఐదేళ్ల గణాంకాలు కూడా ఇదే స్పష్టం చేస్తున్నాయి. కానీ మూడు నెలల్లో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తూ టీటీడీతో పాటు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా మాట్లాడుతున్నారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గోశాలను గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతిరోజూ శుభ్రపరచడం, బ్లీచింగ్ చేయడం జరుగుతుంది.సహజ మరణం పొందిన ఆవులకు పోస్టుమార్టం చేయడం ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదు. నేను నాస్తికుడినని స్వయంగా కరుణాకరరెడ్డి ప్రకటించుకున్న గతంలో ప్రకటించుకున్నారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. కోవిడ్ సమయంలో స్వామి వారి ప్రసాదాలను కూడా దారిమళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకరరెడ్డిది అన్నారు. కరుణాకరరెడ్డి అవినీతి, అక్రమాలతో టీటీడీ ఖజానాను దారిమళ్ళించి కమిషన్లు కొట్టేశారు. చేసిన తప్పుడు పనులకు విధుల దూరం అయిన హరనాథ్ రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీ పై తప్పుడు ప్రచారాలు చేస్తారా అని మంత్రి నారాయణ ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇటువంటి అసత్యపు ఆరోపణలు మానుకోవాలని ఆయన హితవుపలికారు.


# అన్నా రాంబాబుని సత్కరించిన స్టేట్ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ సెక్రెటరీ మేడ బద్రీనాథ్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 12)

పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్వగృహంలో శనివారం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో స్టేట్ ఇంటలెక్చుల్స్ ఫోరమ్ సెక్రటరీగా నియమితులైన మేడ వెంకట బద్రీనాథ్ గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నా రాంబాబుని మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మాజీ ఏఎంసి ఛైర్మన్ షంషీర్ అలీ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కందులకు స్వాగతం పలికిన టీడీపీ నాయకులు









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 12)

యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికాలోని టిడిపి ఎన్ఆర్ఐ తెలుగు ఫోరమ్ ఆహ్వానం మేరకు అమెరికాలోని పలు నగరాల్లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాల్లో పాల్గొని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ కూన రవికుమార్‌లు శనివారం హైదరాబాద్‌లోని ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, తానికొండ వెంకటరావు, తలమల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం ఎమ్మెల్యే కందులకు స్వదేశాగమన శుభాకాంక్షలు

## తెలుగు యువత మండలాధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 12)



మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికాలోని టిడిపి ఎన్ఆర్ఐ తెలుగు ఫోరమ్ ఆహ్వానం మేరకు అమెరికాలోని పలు నగరాల్లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ కార్యక్రమాలను ముగించుకుని శనివారం తిరిగి స్వదేశాగమనం చేశారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి మండల తెలుగుయువత అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేద ప్రజల ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు

**13 మంది లబ్ధిదారులకు రూ.13,52,070ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి**







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 12)**

కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 13 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.13,52,070 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల పాలిట ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారా చెక్కులు తీసుకుని లబ్ధిదారులు మా ఆరోగ్య సమస్యల స్పందించి ఇంత మొత్తములో చెక్కులు పంపిణీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, రెబ్బవరపు మాల్యాద్రి, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ నాయబ్ రసూల్, మహర్షి శీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మహమ్మదాపురంలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు





**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 12)**

మండలంలోని మహమ్మదాపురం హైస్కూల్లో ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి రోజు సెలవు దినం కావడంతో పాఠశాలలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహమ్మదాపురం నందు ముందుగానే అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాతం శ్రీనివాసరావు అంబేద్కర్ జీవిత విశేషాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న కుల వివక్షతను, స్వాతంత్ర ఉద్యమ సమయంలో ఆయన యొక్క పాత్రను, రాజ్యాంగ రచనలో ఆయన యొక్క భూమికను, తొలి భారత న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ సాధించిన విజయాన్ని విపులంగా వివరించడం జరిగింది. ఉపాధ్యాయులు,విద్యార్థులు అంబేద్కర్ గురించి ఉపన్యసించడం జరిగింది. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థిని, విద్యార్థులకు,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు , మిఠాయిలు పంచారు. విద్యార్థినీ ,విద్యార్థులకు అంబేద్కర్ పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. అంబేద్కర్‌పై విద్యార్థినులు చేసిన నృత్య కార్యక్రమం అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో నాగమణి, విజయ భాస్కర్ రెడ్డి, దద్దాల శ్రీనివాసులు, మర్రి మోషే, నారాయణ, శ్రీనివాసులు, శశిభూషణ్, బాలయ్య, భాష, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, హిమబిందు, విజయలక్ష్మి, భారతి, కృష్ణారెడ్డి, సంధాని, కిషోర్ గార్లు పాల్గొన్నారు.

# శుద్ధపూస మాటలు ఆపు పిన్నెల్లి
# శ్రీ కృష్ణదేవరాయులపై విమర్శలు చేస్తే ఊరుకోం

## మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జులకంటి ఆగ్రహం



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 12)**

అభివృద్ధి కాముకుడైనా నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులను అత్యంత అవినీతిపరుడు, కబ్జాకోరైన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంల ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు అభివృద్ధికి ఎంపీ లావు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి, అహర్నిశలు పాటుపడుతుంటే ఆయనపై విష ప్రచారం చేస్తూ.బురద రాజకీయాలకు తెర తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెర్రి వాగు జలాలను రైతులకు ఇవ్వకుండా దగా చేసి.స్వగ్రామమైన కండ్లకుంటలో నీటి వ్యాపారం చేసే దౌర్భాగ్యుడవైన నీవా శ్రీకృష్ణదేవరాయులను విమర్శించేది అని ప్రశ్నించారు. వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న నీవు. సిగ్గు లేకుండా ఏ మొహం పెట్టుకొని రాజకీయం చేస్తున్నావని మండిపడ్డారు. బ్రతుకంతా అవినీతి మయం అని.ఐదేళ్లలో నువ్వు చేసిన అవినీతి దందాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ పిన్నెల్లికి జూలకంటి సవాలు విసిరారు. వరికపూడిశెలను నిర్మించేది ఎన్డీఏ ప్రభుత్వమేనన్నారు. పది నెలల్లో ఏది సాధ్యం కాదని గుర్తు చేశారు. అనుపు, కొప్పునూరు, ధర్మవరం,పేట సన్నెగండ్ల ఎత్తిపోతల పథకాలను పూర్తిగా పడకేసేలా చేసి.నేడు సుద్దపూసల మాట్లాడటం పిన్నెల్లికి తగదని ఎద్దేవా చేశారు.

**విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు**

మాచర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విద్వేషాలు రెచ్చ కొట్టేలా రాజకీయాలు చేస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి ఫైర్ అయ్యారు. అనేక కేసులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పిన్నెల్లి మాటలు విని రెచ్చిపోతే ఆయనతో పాటు నాయకులు సైతం జైలు పాలుకాక తప్పదని హెచ్చరించారు. కులాలు. మతాలు.కుటుంబాల మధ్య కుంపట్లు పెట్టి రాజకీయ చలి మంటలు కాచుకునే నీచుడు పిన్నెల్లి అని ఆరోపించారు. రాచపీనుగా ఒంటరిగా జైలుకు పోకూడదని.వెంట వైసీపీ మందిని తీసుకెళ్లేందుకు ఈ రచ్చ కొట్టే రాజకీయాలకు తెర తీస్తున్నారని విమర్శించారు.

**విధ్వంసకర రాజకీయవేత్త జగన్‌రెడ్డి**

రాష్ట్రంలో పోలవరం, అమరావతి నిర్మాణాలను సర్వనాశనం చేసి, ఐదేళ్ల పాటు జగన్ రెడ్డి విధ్వంసకర రాజకీయాలకు తెర తీశారని ఎమ్మెల్యే జూలకంటి విమర్శించారు. ఎన్నికల హామీలో ఏ ఒక్కటి నెరవేర్చకుండా యువతను, ఉద్యోగులను దగా చేశారని మండిపడ్డారు.అన్ని వర్గాల వారిని హింసించి, ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారని ఆయన అన్నారు.నేడు ఎన్డీఏ ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు, పింఛన్ దారులకు పింఛను ఒకటవ తారీకునే అందుతున్నాయని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వేల కోట్లతో నిర్మించిన టిట్కో ఇళ్లను ఐదేళ్లపాటు మూలన పెట్టి, పేదల జీవితాలతో జగన్ రెడ్డి ఆటలు ఆడుకున్నారని, నేడు వాటిని యుద్ధ ప్రాతిపదికన వినియోగంలోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# వీరిశెట్టి - హ్యాట్రిక్ పొదిలిలో టాప్ మార్క్

## ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో టౌన్ ఫస్ట్

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 12)**

శనివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో పొదిలిలోని రత్నం విద్యాసంస్థల వారి శ్రీ వీరిశెట్టి జూనియర్ కాలేజ్ ప్రభంజనం సృష్టించింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 463 మార్కులతో టౌన్ ఫస్ట్, బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 433 మార్కులతో టౌన్ ఫస్ట్, సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను 456 మార్కులతో టౌన్ ఫస్ట్‌ను సాధించడమే గాక అన్ని విభాగాలలో స్టేట్ మార్కులను తాకి జిల్లాతో పాటు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి గెలిచింది. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా అత్యున్నత మార్కులు సాధించింది. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో స్టేట్ రికార్డులు సాధించి పొదిలి పేరును రాష్ట్రస్థాయిలో శ్రీ వీరిశెట్టి జూనియర్ కాలేజ్ నిలబెట్టింది. అంతేకాక గడిచిన రెండేళ్లుగా టౌన్ ఫస్ట్‌తో పాటు జిల్లా ర్యాంకులు సాధించి నేడు మూడోసారి 463 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించడంలో హ్యాట్రిక్ కొట్టింది. ఎంపీసీ, బైపిసి, సిఇసి వరుసగా అన్ని విభాగాలలో తన సత్తాను సాటి శ్రీ వీరిశెట్టి ప్రభంజనం సృష్టించింది.

# టీటీడీపై భూమన వ్యాఖ్యలు సహేతుకం

## టీటీడీ పై తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలి

## మ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 12)**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ, టీటీడీలో గోవుల మృతిపై భూమన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అహేతుకమని, ప్రజలను దారితప్పించేలా ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీ పై భూమన కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, గతంలో వెంకటేశ్వర స్వామి గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గత ప్రభుత్వం టీటీడీ చైర్మన్‌గా నియమించడం దురదృష్టకరమని తెలిపారు. ఇప్పుడు కూడా "ఏదో జరుగుతుందంటూ" కల్పిత కథనాలతో మీడియా ముందుకు రావడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి చెందిందని,. ప్రస్తుతం టీటీడీ పాలకమండలి నేతృత్వంలో తిరుమలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కానీ గత వైసిపి ప్రభుత్వం లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ట దిగజార్చారని, భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంలో వాడే నెయ్యిని కూడా కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీలో కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం డాలర్లు మాయం చేయటం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని, కోవిడ్ సమయంలో స్వామివారి ప్రసాదాలను కూడా దారి మళ్ళించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకర్ రెడ్డిదని విమర్శించారు. మా పార్టీకి చెందిన కార్యకర్త కిరణ్ ఆడవారిపై అసభ్యకరమైన మాటలు మాట్లాడినందుకు వెంటనే చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబద్ధతగల నాయకుడని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ అనంతపురంలో పోలీసులను విమర్శించిన తీరును కూడా ఆయన తప్పుబట్టారు. వైసీపీ పాలన నైతికంగా విఫలమైందని, అందుకే గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమైందని ఇంటూరి వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కు ఆ పార్టీ దిగజారుతుందని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సమర్థవంతంగా వినియోగించి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని, రాయలసీమ మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ధ్యేయమని, టీడీపీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తుందని ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, రెబ్బవరపు మాల్యాద్రి, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ నాయబ్ రసూల్, మహర్షి శీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# మంగంపల్లిలో ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

## విజేతలకు బహుమతులు అందజేసిన రంగా బ్రదర్స్





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 12)**

హనుమంతునిపాడు మండల పరిధిలోని మంగమ్మ పల్లి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ మంగమ్మ తల్లి సమేత గరటయ్య స్వామి వార్ల తిరునాళ్ళ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఎద్దులతో బండలాగుడు పోటీలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో పలు ప్రాంతాల నుంచి 12 జతల ఎద్దులతో పోటీదారులు పాల్గొన్నారు. పోటీలను చూసేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం విజేతలకు రంగా బ్రదర్స్ మువ్వా సాయి రంగయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి మువ్వా రంగ సాయి, మువ్వా సాయి బాబు, మువ్వా రంగ, నీటి సంగం చైర్మన్ నందనవనం పెన్నా గురవయ్యలు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రథమ స్థానంలో పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మధురవాణి

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 12)**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న కే మధురవాణి సిఇసి గ్రూపులో 472 మార్కులు సాధించి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే మొదటి స్థానం వచ్చింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కే అభిషేకు ఎంపీసీ గ్రూపు నందు 928 మార్కులు సాధించి కళాశాల మొదటి స్థానంలో నిలిచాడు. వీళ్లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని ప్రజలు అభినందనలు తెలిపారు.





# ఉత్తమ ఫలితాలకు కేరాఫ్ కృష్ణవేణి




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 12)
శనివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక కృష్ణవేణి జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయభేరి మోగించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలి 980 మార్కులు ఎస్కే సమీర్ కళాశాల ప్రథమ స్థానాన్ని సాధించాడు.బైపిసిలి 955 మార్కులతో ఉప్పు రూప పట్టణ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. 953 మార్కులతో ఎజ్జల సౌమ్య పట్టణ ద్వితీయ స్థానాన్ని,941లి మార్కులతో తప్పెట తెరిస్సా పట్టణ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే 909 మార్కులతో షేక్ మెహతాజ్ సీనియర్ సిఈసి నందు పట్టణ ప్రథమ స్థానాన్ని, 881 మార్కులతో షేక్ నాగుల్ మీరా పట్టణ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 21 మంది. అదేవిధంగా ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపీసీలో 461 మార్కులతో షేక్ షాజియా కళాశాల ప్రథమ స్థానాన్ని సాధించింది. 459లి మార్కులతో జి .కనకమహాలక్ష్మిలి ద్వితీయ స్థానాన్ని ,455లి మార్కులతో జె.లక్ష్మీ ప్రసన్న సిఇసి కళాశాల ప్రథమ స్థానాన్ని సాధించింది. వీరితో పాటుగా జూనియర్ ఇంటర్లో 400 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 24 మంది అని కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరామయ్య మాట్లాడుతూ ఇంతటి ఘన విజయాన్ని సాధించడానికి సహకరించిన ఉపాధ్యాయులకు విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రారంభించి నప్పటి నుండి ఉత్తమ ఫలితాలను సాధిస్తూ, టౌన్ ఫస్ట్ గా నిలుస్తూ ప్రజల మన్నలను పొందుతున్న ఏకైక విద్యా సంస్థ కృష్ణవేణి జూనియర్ కాలేజ్ అని ఆయన ఉద్ఘాటించారు. తమ విద్యార్థులు ఎంసెట్ ఫలితాలలో కూడా ఉత్తమ ర్యాంకులను సాధిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలకు ఉన్నత విద్యా బోధనకు చిరునామా మా కృష్ణవేణి జూనియర్ కాలేజీ అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందనలను తెలిపారు.

# వక్ఫ్‌బోర్డు బిల్లును రద్దు చేయాలి

## సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్ బాబు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 12)
సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్తంగా శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా కందుకూరు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో సిపిఐ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు మాట్లాడుతూ ఒకే ఒక నినాదం ముందుకు తీసుకువచ్చారు. దేశ ఐక్యతకు సమైక్యతకు ముప్పుగా మారే వక్ఫ్‌బోర్డు బిల్లును రద్దు చేయాలని పాత బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు . మనువాద మూలాలపై ఏర్పడిన బిజెపి భారతదేశాన్ని హిందూ రాజ్యాంగా చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆ కుట్రలో భాగంగానే నూతన వక్ఫ్బోర్డు బిల్లును అమలు చేయాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కులాలు, మతాలు భిన్నత్వంలో ఏకత్వం ఉన్న భారతదేశంలో ఐక్యతకు ఇలాంటి బిల్లులు అడ్డుగోడగా నిలిచే ప్రమాదం ఉందని అన్నారు. నూతన వక్ఫ్బోర్డు బిల్లు వలన విలువైన భూములు బడా బాబులకు అప్పగించేందుకే కుట్రలు జరుగుతున్నాయని, చట్టాలను ప్రతి ఒక్కరు అర్థం చేసుకొని ఐక్యంగా ఉద్యమించి బిల్లు రద్దయ్యే వరకు ఒకే మాట ఒకే బాట ఒకే అడుగుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపు ఇచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన జాషువా సాహితీ సంస్థ అధ్యక్షులు ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి అరాచక బిల్లును అడ్డుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని దేశవ్యాప్తంగా వాము పక్షాలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా దళిత బహుజన ప్రజా సంఘాలు పాల్గొని ఉద్యమిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఆలోచించే దేశ సమైక్యతకు ఐక్యతకు అవరోధంగా మారే ఇలాంటి బిల్లు రద్దయ్య వరకు ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎర్రం శెట్టి ఆనందమోహన్, ఆదినారాయణ ,బాల బ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు ,మహిళ సమాఖ్య కోశాధికారి ఇంద్రజ, బ్రహ్మానందం, జిలాని ,తదితరులు పాల్గొన్నారు.




# వక్ఫ్ చట్ట సవరణలను ఉపసంహరించాలి

## సిపిఐ ఒంగోలు నగర సమితి డిమాండ్

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
వక్ఫ్ చట్టానికి చేసిన 14 సవరణలను వెంటనే ఉపసంహరించాలని ముస్లిం మైనారిటీల పట్ల కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను విడనాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు డిమాండ్ చేశారు యూపీఏ అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత 11 సంవత్సరాలుగా ముస్లిం మైనారిటీ వర్గాన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టుతూ వారిని శత్రువులుగా భావిస్తూ వారిపట్ల కేంద్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తుందని వారి ఆస్తులను ప్రభుత్వ కైవసం చేసుకోవడానికి మోడీ ప్రభుత్వం అమానుషంగా చట్ట సవరణలు చేసిందని ముమ్ముందు క్రిస్టియన్ సంస్థల ఆస్తులు హస్తగతం చేసుకోవడానికి అంతిమంగా హిందూ మత ఆస్తులను సైతం స్వాహా చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించే దిశగా యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సిపిఐ నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు విమర్శించారు. సిపిఐ సీనియర్ నాయకులు సర్దార్ చట్టానికి సంబంధించి చేసిన సవరణలను విశదీకరించారు.ఈ ధర్నాలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలకు టీడీపీ, వైస్సార్ పార్టీలు వంతపాడటం దుర్మార్గమన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు మాజీ నగర కార్యదర్శి ఉప్పుటూరి ప్రకాశం మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ మైనారిటీలకు, బీసీ, ఎస్సీ,ఎస్టీలకు అండగానిలుస్తుందన్నారు. రైతుసంఘ కార్యదర్శి రెడ్డి ముస్లిమ్స్ అందరూ ఐక్యంగా ఉండి కేంద్రప్రభుత్వంపై పోరాడాలని మీ పోరాటానికి సిపిఐ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. ధర్నాలో కారుమూడి నాగేశ్వరరావు, లక్ష్మయ్య, పోలేరయ్య, ఏ వై రెడ్డి, శ్రీనివాసులు ముస్లిం మహిళలు మత పెద్దలు పాల్గొన్నారు.

## అమోనియా గ్యాస్ లీకేజీ పై

# స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం

## రెవెన్యూ, పోలీసు అధికారుల ద్వారా పూర్తి వివరాలు

## సేకరించిన నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా టిపి గూడూరు అనంతవరం గ్రామంలోని గ్యాస్ లీకేజీ పై శనివారం జరిగిన సంఘటనపై అధికారులు వెంటనే స్పందించి వివరాలను సేకరించారు. ప్లాంట్ కాంపౌండ్‌లో స్వల్పంగా గ్యాస్ లీకేజీ అయిన వెంటనే మరమ్మత్తులు చేపట్టింది యాజమాన్యం. ప్రస్తుతం సాధారణ స్థితిలో ప్లాంట్ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేవని భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ఆర్డీవో తెలిపారు.

# యాదవ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
ఒంగోలులోని అష్టోన ఫంక్షన్ హాల్లో యాదవ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి ఘన సన్మానం నిర్వహించారు. యాదవ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సంఘ ఐక్యతను బలపరిచేలా, సంస్కృతిక గౌరవాన్ని చాటేలా నిర్వహించబడింది. కార్యక్రమంలో వారి నాయకుడిగా మంత్రిని సన్మానించడం జరిగిందని మంత్రి యాదవ కమ్యూనిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, యాదవ్ వర్గ సాధికారత, ప్రాతినిధ్యం, అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. యాదవ్ వర్గం రాష్ట్రంలో సామాజిక, సాంస్కృతిక రంగాలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరుపురం వెంకట్రావు, యోగయ్య యాదవ్, డి శివాజీ, ఇతర యాదవ్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కాటంరాజు దేవస్థానం అభివృద్ధికి కృషి

## యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 12)
ఈ నెల 12న శ్రీ కాటమరాజు ఆలయ పరిధిలో 30 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వెలుగులు నింపిన యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుని కలిసి సన్మానించారు కాటమరాజు ఆలయ కమిటీ నూతన అధ్యక్షులు గుమ్మా గంగరాజు యాదవ్ ఆలయం ముఖ్య బాధ్యులు పీఎల్పీ యాదవ్, యాదవ సోదరులు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ తన పరిధిలో ఉన్నంతవరకు కాటంరాజు దేవస్థానం అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తానని వెలుగొండ ప్రాజెక్టు నీళ్లు వచ్చే లోపు ఒక సర్వే నిర్వహించి బద్వీడు చెర్లో పల్లి వైపు నుంచి రెండో మార్గాన్ని అభివృద్ధి చేద్దామని దానికి సంబంధించి తాను కూడా నూతన రోడ్డు సర్వేకు కమిటీ సభ్యులతో కలిసి పాదయాత్ర చేస్తారని తెలియజేశారు. సంబంధిత శాఖల అధికారులను తీసుకొని వరకు రోడ్డు వేయడానికి ఉన్నటువంటి మార్గాల మీద అన్వేషణ చేద్దామని వారు తెలిపారు. అనంతరం కాటంరాజు ఆలయ నూతన కమిటీ అధ్యక్షులుగా నియమితులైన గుమ్మా గంగరాజు యాదవ్ కు శాలువా కప్పి ఎరిక్షన్ బాబు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి రాష్ట్ర స్థాయిలో అందరి సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

# గ్యాస్ లీకేజీ ఘటన పై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరా



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 12)
తోటపల్లి గూడూరు మండలం వరకవిపూడి పంచాయతీ పరిధిలోని అనంతపురంలో ఉన్న వాటర్ బేస్ రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంటు అమ్మోనియా గ్యాస్ లీకైన ఘటనపై శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరా తీశారు. అధికారులతో పాటు టీపీ గూడూరు మండల టీడీపీ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్నారు సోమిరెడ్డి. గ్యాస్ లీకేజీ ప్రభావం స్వల్పమేనని, అది కూడా ప్లాంటు వరకే పరిమితమైందని, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదని నాయకులు వివరించారు. అమోనియా గ్యాస్ ప్రభావంతో అస్వస్థతకు గురైన వాటర్ బేస్ కంపెనీ ఉద్యోగులు, కార్మికులు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆకాంక్షించారు.

## ప్రశాంతంగా తిరునాళ్ల జరుపుకోవాలి కనిగిరి సీఐ ఖాజావలి





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 12)
హనుమంతునిపాడు మండలం మంగంపల్లి గ్రామంలో శ్రీ మంగమ్మ తల్లి సమేత గరటయ్య స్వామి తిరుణాళ్లకు గట్టి బందోబస్తు చర్యలను చేపడుతున్నామని కనిగిరి సీఐ ఖాజావలి తెలిపారు. శనివారం మంగంపల్లిలో తిరునాళ్లకు తీసుకుంటున్న చర్యలపై ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీసులతో సిఐ సమావేశం నిర్వహించారు. తిరుణాలలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు, పోలీస్ సిబ్బందికి సిఐ సూచించారు. ప్రశాంతంగా తిరునాళ్ల జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
మద్దిపాడు మండలంలోని మద్దిపాడు నుంచి ఒంగోలు వెళ్లే నేషనల్ హైవే పైన హర్షిని కాలేజీ దాటిన తర్వాత ఉన్న యేదుగుండ్లపాడు బస్సు షెల్టర్ పక్కన సుమారు 35 నుండి 45 సంవత్సరాల వయస్సు గల ఒక మగ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. ఈ చనిపోయిన వ్యక్తి చెస్ట్ పైన సరోజా అని పచ్చబొట్టు రాయబడి ఉన్నది. ఇతనికి సంబంధించిన ఎటువంటి ఆనవాళ్లు దొరకలేదు. దీని మీద యేదుగుం డ్లపాడు వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎవరైనా వ్యక్తులు కనిపించకుండా పోయినట్లయితే మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తెలపాలని ఎస్ఐ శివరామయ్య తెలిపారు.

# పొన్నలూరులో ఈదురు గాలుల బీభత్సం





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 12)
మండలంలో శనివారం వర్షం గాలలు బీభత్సంతో చెట్లు పడిపోయాయి. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అనుకోకుండా అకాలంగా ఒక్కసారిగా గాలితో కూడిన వర్షం రావటంతో చెట్లు నేలకు ఒరిగాయి. ఇంటిపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర గాలి బీభత్సంకు చెట్లు కొమ్మలు తెగి ద్విచక్ర వాహనాల మీద పడ్డాయి. అలాగే బస్టాండ్ సమీపంలో చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలిపోయి. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచటం వలన బ్యార్నీ దగ్గర పొగాకు బెల్లు, పంట పొలాల్లో ఆరబోసి ఉన్న మిరప ఈ గాలి వాన దెబ్బకు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా గాలివాన రావడంతో గ్రామంలోని ప్రజలు భయబ్రాంతులకు చెందారు.

# ఇంటర్ ఫలితాల్లో జీవీఎస్ఎం ప్రతిభ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 12)
ఉలవపాడులోని జీవీఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. వారిలో కత్తి సాల్మన్ రాజు 935/1000 (సీనియర్ ఎంపీసీ), ఆవులూరి నిషా 790/1000 సీనియర్ బైపీసీ, ఉప్పు ఆనంద్ 564/1000 సీనియర్ సీఈసీ, చిరితోటి స్పందన 389/470 జూనియర్ ఎంపీసీ, నలతోటి సిరి 407/440 జూనియర్ బైపీసీ, ఎల్లంగారి హరి చరణ్ 377/500 జూనియర్ సీఈసీలలో మంచి ఫలితాలు రాబట్టినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు.

# ఇంటర్ ఫలితాలలో ప్రతిభా పల్నాడు జూనియర్ కాలేజీ విద్యార్థుల విజయభేరి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 12)
శనివారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ప్రతిభ జూనియర్ కాలేజీ మండలం ఫస్ట్ ర్యాంక్ సాధించి విజయభేరి మోగించారు. ఇంటర్ మొదటి మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ బైపిసి సిఇసి గ్రూపులలో మరోసారి మండలం ఫస్ట్ సాధించి ప్రతిభా జూనియర్ కాలేజీ మాచర్ల నియోజకవర్గంలో విజయకేతనాన్ని ఎగరవేసింది.నేడు ప్రకటించిన ఇంటర్మీడియట్ మొదటి , రెండో సంవత్సరపు ఫలితాలలో పలనాడు, ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అసాధారణమైన మార్కులతో డివిజన్, పట్టణ ప్రథమ స్థానాన్ని పొందడం జరిగింది. ఈ ఫలితాలను కళాశాలల సెక్రెటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి తెలియజేస్తూ, పలనాడు జూనియర్ కళాశాల విద్యార్థిని సీనియర్ ఇంటర్ ఎం.పీ.సీ విభాగం నందు మునుపల్లి భానుమతి 987 మార్కులతో డివిజన్ స్థాయిలో, పట్టణ స్థాయిలో మొదటి ర్యాంకును పొందిందని, రాచూరి జలీల్ 977, రాళ్లపల్లి స్వాతి 976 పొందినారు అని తెలియజేశారు. అదేవిధంగా ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థిని సయ్యద్ నాజియా పర్వీన్ 968, జీ.వీ.ఎల్.సాహితి 965, జి.ప్రవీణ్ 965 మార్కులు పొందినట్లు తెలియజేశారు. సీనియర్ ఇంటర్ బై.పీ.సీ విభాగంలో పీ.మోషే 939, జి.హారిక 928, షేక్ వాహిదా 923 మార్కులు పొందినారు. సీనియర్ ఇంటర్ సీ.ఈ.సీ ఫలితాలలో జె. నాగ దుర్గ 903 మార్కులతో పట్టణంలో ద్వితీయ ర్యాంకులు పొందినట్లుగా తెలియజేశారు. పలనాడు జూనియర్ కాలేజీ విద్యార్థులు 25 మంది ప్రతిభా జూనియర్ కాలేజీ విద్యార్థులు 16 మంది 900 మార్కులకు పైగా సాధించారు. జూనియర్ ఇంటర్ ఫలితాలలో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థి కె.దుర్గా తిరుపతిరావు 464 మార్కులతొ డివిజన్ మరియు పట్టణ ప్రథమ స్థానాన్ని పొందినట్లు తెలిపారు. పలనాడు జూనియర్ కాలేజీ విద్యార్థి తిర్లికా విశ్వ చైతన్య 461 మార్కులతో పట్టణ ద్వితీయ స్థానాన్ని పొందినట్లు, రాచ మడుగు లక్ష్మీ సుహాశ్రీ 460, కొత్త మాసు వెంకట అనంతలక్ష్మి నిహిత్ 458, ఏ శ్రీలక్ష్మి 453 మార్కులు పొందారు. జూనియర్ ఇంటర్ బై.పీ.సీ విభాగంలో షేక్ షమీనా 409 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానాన్ని, ఎస్ ఉదయరాజు 401 మార్కులతో పట్టణంలో ద్వితీయ స్థానాన్ని , అదేవిధంగా జూనియర్ ఇంటర్ సీ.ఇ.సీ విభాగంలో కే. సాయి రమ్య 457 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానాన్ని పొందినట్లు తెలియజేశారు. పల్నాడు జూనియర్ కాలేజీ విద్యార్థులు 22 మంది ప్రతిభ జూనియర్ కాలేజీ విద్యార్థులు 15 మంది 400 మార్కులు పైగా సాధించినారు అని తెలియజేశారు. గ్రూపు సబ్జెక్టుల యందు వందకు వందశాతం ఫలితాలను నలుగురు విద్యార్థులు పొందారు. ఉత్తమ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులను కళాశాల చైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనలో తమకు సహకరించిన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపాల్స్ నూతలపాటి శివ భాస్కర్ , మద్రి వెంకటనారాయణలు కృతజ్ఞతలు తెలియజేశారు. అత్యుత్తమ ఫలితాల సాధనలో, కళాశాల విజయంలో భాగమైన అందరికీ కళాశాల డైరెక్టర్లు ఇరు వంటి ఆంజనేయ శాస్త్రి, షేక్ మస్తాన్ వలి అభినందించారు. ఈ సందర్భంలో కళాశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. సీనియర్ , జూనియర్ ఇంటర్ ఎం.పీ.సీ విభాగాలలో కే దుర్గా తిరుపతిరావు 464, ద్వితీయ ఎం.పీ.సీ గ్రూపు నందు 987 మార్కులతో మొదటి స్థానాన్ని, పొందటమే కాక ఇప్పటి వరకు పల్నాడు చరిత్రలో ఎప్పుడూ పొందునటువంటి మార్కులు పొంది, కళాశాలకు, పట్టణానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకొచ్చినటువంటి విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## దొడ్డవారి వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జంకే, గెల్లి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 12)
పట్టణంలోని స్థానిక తర్లపాడు రోడ్డులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో దొడ్డవారి వివాహ మహోత్సవం శనివారం బంధుమిత్రుల మధ్య అట్టహాసంగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జంకే వెంకటరెడ్డి, ప్రముఖ న్యాయవాది గెల్లి చౌడేశ్వరావు పాల్గొని నూతన దంపతులు కలకాలం అష్టైశ్వర్యాలు, పిల్లా పాపలతో సుఖంగా జీవించాలని ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో పెద్దఎత్తున బంధుమిత్రులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థినికి మంత్రి డోలా అభినందనలు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 12)
జాతీయస్థాయి ఐఎన్ఎస్‌టీవో మ్యాథమెటిక్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన సింగరాయకొండ మూలగుంటపాడు శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌కి చెందిన 7 వ తరగతి విద్యార్థిని సంకటి వైష్ణవిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా శనివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థిని అభినందించారు. ఇలాంటి విజయాలు కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి ఆకాంక్షించారు.

## ఇంటర్ ఫలితాలలో ఎస్ఎస్ఎన్ హవా








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
ఇంటర్మీడియట్ 2025 పరీక్ష ఫలితాలలో ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ హవా కొనసాగించినట్లు ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ఎల్లటూరి శివానంద రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శివానంద రెడ్డి మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎన్ సావిని, పి జోషితలు 470 మార్కులు గాను 465 సాధించి తమ సత్తా చాటారన్నారు. 464 మార్కులు నలుగురు విద్యార్థులు, 463 మార్కులను ఇద్దరు విద్యార్థులు, 462 మార్కులను ఇద్దరు విద్యార్థులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల అకాడమిక్ డీన్ యం జానార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 460కి పైగా మార్కులను 12 మంది విద్యార్థులు, 455 కు పైగా మార్కులను 19 మంది విద్యార్థులు, 400 పైగా మార్కులను 75 మంది విద్యార్థులు సాధించాలన్నారు. 175 మంది విద్యార్థులకు గాను 75 మంది విద్యార్థులు 400 పైగా మార్కులను సాధించటం తమ విద్యా ప్రమాణాలను తెలియజేస్తుందన్నారు. 90 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్యాసంస్థ ఎస్ఎస్ఎన్ అన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పై శివానందరెడ్డి, డీన్ యం జానార్దన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపక బృందం అభినందించారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభ హల్ చల్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులతో హల్చల్ చేశారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ భాగంలో గోట్ల శృతి, చిమ్మిరి స్నేహ 990 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే కుమ్మర వెంకట కళ్యాణ్ రామ్ 989 మార్కులు, తుమ్మలూరు మౌనిక, శెట్టి పూజిత లు 988మార్కులు, చిన్నపరెడ్డి వెంకట త్రిష, అద్దంకి వంశీ, కుర్ర వెంకట మహాలక్ష్మి లు 987 మార్కులు, పోతు విష్ణు, అట్లా వెంకట ప్రసాద్, మల్లెల తులసీలు 986 మార్కులు, వెంకట నాగ సాయి యశోవర్ధన్, కంట జస్వంత్ లు 985 మార్కులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో వెలుగు హాసిని 1000 మార్కులకు 987 మార్కులు, దొండపాటి స్నేహరెడ్డి 981 మార్కులు సాధించారు. అలాగే ఎంపీసీ జూనియర్ ఇంటర్ విభాగంలో ఆరే సాయి ధీరజ్, మాకినేని మనోజ్, షేక్ అస్రుద్దీన్ 470 మార్కులు గాను 465 మార్కులు, కాలువ పూర్ణచంద్ర, బండారు గోపీచంద్, చల్ల శ్రావ్య, తాళ్లూరి రమ్య, ఆంధ్ర దీపిక లు 464 మార్కులను సాధించారు. అలాగే బైపిసి భాగంలో దేవండ్ల పూజిత 470 మార్కులు గాను 433 మార్కులు, దాసరి వైశాలి 430 మార్కులు, పిన్నిక సంతోషిని 429 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ అభినందించారు. అనంతరం విద్యార్థునీలు ఆనందంతో డాన్సులు వేసారు.



## టీటీడీ గోమరణాల పై భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారం

### మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర
### ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 12)
టీటీడీ గోమరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మండిపడ్డారు. శనివారం సాయంత్రం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మీడియాకు ప్రెస్ నోట్ విడుదల చేసారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదో నల్లరాయి, దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ’ గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపారు. అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, ఏడుకొండలను 5 కొడలుగా మార్చి కుట్ర చేసింది, టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్ గా మార్చే చర్యలకు పాల్పడింది నువ్వు కాదా? చేసిన తప్పుడు పనులకు విధుల దూరం అయిన హరనాధ్ రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీ పై తప్పుడు ప్రచారాలు చేస్తారా? మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అన్ని ఈ సందర్భంగా జనార్దన్ మీడియాకు తెలిపారు.

## టిటిడి పై అసత్య ఆరోపణలు చేస్తే మట్టి కొట్టుకుని పోతారు

### భూమన కరుణాకర్ రెడ్డి పై ఎమ్మెల్యే జూలకంటి ఫైర్




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 12)
తిరుమల తిరుపతి దేవస్థానం పై దుష్ప్రచారం చేస్తున్న భూమన కరుణాకర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మాచర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం పైన అసత్య ఆరోపణ చేస్తున్న కరుణాకర్ రెడ్డి.తిరుమల వేదికగా ఎన్నో అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డారని చెప్పారు. టిటిడి గోశాలలో గోవులు మృత్యువాత పడుతున్నాయని చేస్తున్న విష ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని వివరించారు. గోశాలలో దాదాపు 2,668 గోవులు జియో ట్యాగ్గింగ్ చేసి పాలకమండలి పర్యవేక్షణలో పరిరక్షించబడుతున్నాయని గుర్తు చేశారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను కించపరిచేలా కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. టిటిడి చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, బంగారు డాలర్ల మాయం, విఐపి టికెట్లు అమ్ముకోవడం వంటి అనేక ఆరోపణలు ఉన్న వ్యక్తి.గోశాల పైన వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి క్షమాపణ చెప్పి, చేసిన వ్యాఖ్యలు వెనక తీసుకొని తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రులకు బ్రహ్మన్న ఘన పూజలు

(షణ్ముఖ వెలుగు, మాచర్ల, ఏప్రిల్ 12)
మండల పరిధిలోని గంగలకుంట గ్రామంలో కొలువుతీరిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి తిరుణాల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ తిరణాల మహోత్సవానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా స్వామివారిని జూలకంటి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com